బలగం TV
BALAGAM
నిజమే బా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం, 06 ఆగస్టు-2025 balagamtv100@gmail.com పేజీలు-4

భారీగా పెరిగిన బంగారం ధరలు..



ప్రశ్నించే కలానికే సంకెళ్లా...



# హెూంమంత్రిగా అమిత్‌షా అరుదైన ఘనత..

● ఎల్‌కే అద్వానీ రికార్డు బద్దలు



ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హెూంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు.దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హెూంశాఖమంత్రిగా పని చేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హెూంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది.దీంతో షా వరుసగా రెండోసారి కూడా హెూంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హెూంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హెూం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998 -1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హెూం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హెూం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు.

# పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలి

● బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



న్యూఢిల్లీ : ఈవీఎంలపై దేశ ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, వాటి పట్ల ప్రజలు విశ్వసనీయతను కోల్పోయారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తర్వాత వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశం అనంతరం కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.ఇవాళ ఈసీ ముందు ఆరేడు విషయాలు కుండబద్దలు కొట్టి నట్టు మా పార్టీ అభిప్రాయం చెప్పాం. అందులో ఒకటి ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు అమెరికా లాంటి దేశాలు కానీ, యూకే, జర్మనీ, ఇటలీ కానీ, ఇంకా చాలా దేశాలు కొంతకాలం వరకు ఈవీఎంలను ప్రయోగాత్మకంగా అమ లు చేసినప్పటికీ, ప్రజల్లో వాటిపై విశ్వాసం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఈవీఎంలను రద్దు చేసి పేపర్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇలాంటి దేశంలో ఈవీఎంల వల్ల నష్టం జరుగుతున్నది. మేం వేసిన వారికి ఓటు పడడం లేదని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో ఈవీఎంలను పక్కనపెట్టి, పేపర్ బ్యాలెట్‌లను తేవాలని మా పార్టీ తరపున ఎన్నికల కమిషన్‌ను కోరాం. పేపర్ బ్యాలెట్ విధానాన్ని నవంబర్‌లో జరిగే బీహార్ ఎన్నికల్లో అమలు చేయాలని కోరాం. ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానం అమలు చేయాలని మా పార్టీ తరపున కుండబద్దలు కొట్టినట్టు మా పార్టీ అభిప్రాయం చెప్పామని కేటీఆర్ తెలిపారు.

**ఆ పార్టీని శిక్షించాల్సిన బాధ్యత కూడా ఈసీ మీద ఉంది..**

ఎన్నికల సమయంలో పార్టీలు ఇచ్చే అడ్డగోలు హామీలు, తెలంగాణలో చూస్తే కాంగ్రెస్ పార్టీ ఇష్టమొచ్చినట్టు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి మభ్యపెట్టి గెలిచింది. ఈ విషయాలన్నీంటిని ఈసీకి వివరంగా చెప్పాం. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోకి రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండకపోతే తప్పకుండా ఆ పార్టీని శిక్షించాల్సిన బాధ్యత కూడా ఈసీ మీద ఉంది. ఎన్నికల్లో ప్రజలను వంచించే ఏ పార్టీ అయినా అధికారంలోకి వచ్చాక మోసం చేస్తే సభ్యత్వాన్ని రద్దు చేసే విధంగా, ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇండియాలో ఎన్నికల సంస్కరణలు రావాలి. ప్రజలను ప్రలోభ పెట్టుడుతున్న పార్టీలు, వంచిస్తున్న విషయాలపై చర్చ జరిగిందని కేటీఆర్ తెలిపారు.

# భారత్‌పై మరిన్ని సుంకాలు..

● అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులు




న్యూఢిల్లీ, ఆగస్టు-05: భారత్‌పై మరిన్ని సుంకాలు వేయబోతు న్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకాల వడ్డింపుతో తాను ఆగబోవడం లేదని ముమ్ముందు వాటిని ఇంకా పెంచబోతున్నామని బెదిరించారు. రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తూ మార్కెట్‌లో భారీ లాభాలకు అమ్ముకుంటున్న భారత్‌పై గణనీయ స్థాయిలో సుంకాలు పెంచబోతున్నామని సోషల్‌మీడియా ద్వారా ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు.రష్యాతో యుద్ధంలో ఎంతమంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారో భారత్ పట్టించుకోవడం లేదని, అందుకే ఆ దేశంపై గణనీయంగా సుంకాలు పెంచుతామని ట్రంప్ వెల్లడించారు. ఇదిలావుంటే వలస వ్యవహారాల్లోనూ అమెరికాను భారత్ మోసం చేస్తోందనీ వైట్ హౌస్ ఉన్నతాధికారి స్టీఫెన్ మిల్లర్ విమర్శించారు. దీనివల్ల తమ దేశ కార్మికులకు ఎంతో నష్టం జరుగుతోందని చెప్పారు.

# మంత్రి పదవి కోసం ఎవరి కాళ్లూ పట్టుకోను : రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు-05: అంతకుముందు నల్గొండలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పుడు మంత్రి పదవి ఇస్తానని అన్నారని గుర్తుచేశారు. భువనగిరి ఎంపీ స్థానం గెలిచినప్పుడూ కూడా అదే మా ట చెప్పారని అన్నారు. కానీ ఇప్పుడు పార్టీలు మారిన వాళ్లకు, తనకంటే చిన్నవారికి పదవులు ఇచ్చారని తెలిపారు. . మంత్రి పదవి ఇస్తారా ఇవ్వరా.. మీ ఇష్టం అని అన్నారు. ఎవరి కాళ్లూ మొక్కి నేను పదవులు తెచ్చుకోగదలచుకోలేదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. దిగజారి బతకడం నాకు తెలియదని అన్నారు. మనసు దిగజార్చుకుని బతకడం ఇక నావల్ల కాదంటూ అసహనం వ్యక్తం చేశారు.తన స్వార్థం కోసం పదవి అడగడం లేదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాల్లో పదవులు అడ్డం పెట్టుకుని సంపాదించుకో వాలని లేదని అన్నారు. మునుగోడు ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్తానని అన్నారు. రాజగోపాల్ రెడ్డికి మునుగోడు ప్రజలు, వాళ్ల సంక్షేమం కోసం కావాలన్నారు.

# నిజమైన భారతీయులెవరో చెప్పేది జడ్జీలు కాదు : ప్రియాంకా గాంధీ



న్యూఢిల్లీ: చైనా మన భూభాగాన్ని ఆక్రమించినట్లు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం సుప్రీంకోర్టు సీరియస్ అయిన విషయం తెలిసిందే. నిజమైన భారతీయులు అలా మాట్లాడరు అని కోర్టు ఆ కేసులో పేర్కొన్నది. కోర్టు చేసిన వ్యాఖ్యలపై రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ స్పందించారు. ఇవాళ పార్లమెంట్ ఆవరణలో అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాహుల్‌ను సమర్థించారు. ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని ఆమె అన్నారు. నిజమైన భారతీయులు కాదా అన్న స్టేట్మెంట్‌పై మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి గౌరవం ఉందని, కానీ నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు అని ఆమె అన్నారు. రాహుల్ గాంధీ సైన్యాన్ని, సైనికులను ఎల్లప్పుడూ గౌరవించారని ఆమె పేర్కొన్నారు.నిజమైన భారతీయుడు ఎవరన్న దానికి నిర్వచనం ఎవరు ఇస్తారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేస్తే సమాధానం ఇవ్వడం లేదని, కానీ పార్లమెంట్ బయట మాట్లాడితే జాతివ్యతిరేకులమని ముద్ర వేస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి సందర్భంలో నిజమైన భారతీయుడికి నిర్వచనం ఎవరు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. మేం నిజమైన భారతీయులమని, అందుకే దేశం తరపున ప్రశ్నలు వేస్తున్నామన్నారు.

# కొలిక్కిరాని సినీ కార్మికుల వేతనాల వివాదం..

● చిరంజీవి ఇంటికి చేరిన పంచాయితీ

● గందరగోళంలో సినీ పరిశ్రమ

● సినీ కార్మికుల వేతనాలు పెంచాలి..




హైదరాబాద్, ఆగస్టు-05: తెలుగు సినీ ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 30శాతం పెంచాలని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. కార్మికుల వేతనాలు పెంచాలని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.అమ్మరాజు, కోశాధికారి అలెంగ్జాడర్లు మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో అదనపు కార్మిక కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌తో కలిసి చర్చలు జరిపారు. వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు మూడు సంవత్సరాలుగా పెంచలేదని తెలిపారు. మూడు సంవత్సరాలకు గాను 30శాతం పెంచాలని, సంవత్సరానికి 10శాతం చొప్పన పెంచాలని కోరడం జరిగిందని వారు తెలిపారు. సినీ కార్మికులు ప్రతి రోజూ 18గంటలకు పైగా పనిచేస్తున్నారని, దానికి తగ్గట్లు వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.20వేలకు పైగా ఉన్న కార్మికులు పనికి తగట్టు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సినిమా నిర్మించడంలో కీలకంగా పనిచేస్తున్న కార్మికులు, ఆర్థిక సమస్యల వల్ల.. కుటుంబంతో కలిసి తాము పనిచేసిన సినిమాను కూడా చూడలేని పరిస్థితి నెలకొందన్నారు. తమ సమస్యలను అదనపు కమిషనర్ ఇ.గంగాధర్ దృష్టికి తీసుకెళ్లాగా ఆయన నిర్మాతల అసోసియేషన్ నాయకులతో మాట్లాడి, బుధవారం ఆ విషయాలను వెల్లడి చేస్తామని హామీ ఇచ్చారు.ఇక నిర్మాతలు కూడా ఈ విషయంలో తగ్గేదేలేదు అంటున్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు ఫిల్మ్‌ఛాంబర్‌తో మంగళవారం భేటీ కావడం ఆసక్తిగా మారింది. ఛాంబర్ నిర్ణయమే 'మా' నిర్ణయం అంటూ నిర్మాతలకు ఆయన సంఘీభావం తెలిపారని పలువురు నిర్మాతలు తెలియజేశారు. 30శాతం వేతనాలు పెంచడం సాధ్యం కాదని, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఐటీ ఉద్యోగుల కంటే యూనియన్ కార్మికుల జీతాలే అధికమని, షూటింగులకు ఫెడరేషన్ సహకరించని పక్షంలో ఔత్సాహికులకు అవకాశాలివ్వడానికి సిద్ధంగా ఉన్నామని టీఎఫ్‌సీసీ స్పష్టం చేసింది. ఇప్పటికే నిపుణుల సిబ్బంది కోసం అప్లికేషన్స్ కూడా తీసుకుంటున్నారని సమాచారం.మరోవైపు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కి కూడా పలు కార్మిక సంఘాలు మద్దతు తెలియజేస్తున్నాయి. రెండోరోజు కూడా సమ్మె కొనసాగడంతో సినీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.పరిస్థితుల్ని చక్కదిద్దేందుకు జరుగుతున్న ప్రయ త్నాలన్నీ విఫలం అవుతున్నాయి. ఫిల్మ్‌ఛాంబర్,ఎంప్లాయిస్ ఫెడరేషన్ నిర్ణయాల మధ్య సాధారణ సినీ కార్మికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓపక్క కార్మిక సం ఘాలు లేబర్ కమిషనర్ గంగాధర్‌ని కలవగా, మరోపక్క అగ్ర నటుడు చిరంజీవితో నిర్మాతలు సమావేశమయ్యారు. అల్లు అరవింద్, సి.కల్యాణ్ సుప్రియ యార్లగడ్డ, యలమంచిలి రవిశంకర్ తదితర నిర్మాతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.నిర్మాతల సమస్యలువిన్న చిరంజీవి..కార్మికుల వెర్షన్ కూడావిని నిర్ణయం తీసు కుంటా నని నిర్మాతలతో అన్నారట. రెండుమూడు రోజుల్లో పరిస్థితి చక్కబడని పక్షంలో తాను జోక్యం చేసుకుంటాననని నిర్మాతలకు చిరంజీవి హామీ ఇచ్చారట.

# కాళేశ్వరంపై కేసీఆర్ సోలో డిసిజన్

రేవంత్ ఆరోపణలను ఖండించిన హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు-05: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ సోలో డెసిషన్ తీసుకున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన ఆరోపణలను మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం రిపోర్టుపై ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో హరీశ్‌రావు వాస్తవాలను బయటపెట్టారు. సోల్ డిషీజన్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ అని నిన్న ఏదో చూపించారు. ఎంత ఫేక్ అంటే. ఇదంతా కూడా కడిగేస్తాం.. దుమ్ము దులిపేస్తాం. వాళ్లు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా టైమ్ ఇవ్వాలి. మైక్ కట్ చేసి మీరు పారిపోతారు. రేవంత్ ప్రభుత్వానికి ఇది అలవాటు.. మరిన్ని ఆధారాలు ఉన్నాయి బయటపెడుతామని హరీశ్‌రావు పేర్కొన్నారు.ఒక ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం రివ్యూ చేయడం అనేది సీఎం బాధ్యత. ఆ సీఎం రివ్యూ చేయకపోతే తప్పు.. చేస్తే తప్పా..? ఉద్యమం చేసి తెలంగాణ సాధించిన వ్యక్తి.. నీళ్లు ఇవ్వాలని తపనపడిన వ్యక్తి కనుక రాత్రింబవళ్లు కష్టపడి త్వరగా పూర్తి చేయాలని రివ్యూ చేశాడు. కానీ సోల్ డిసీజన్ అని చెప్పారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణాలు వాప్కోస్ డీపీఆర్, హై పవర్ కమిటీ సిఫార్సులు, కేబినెట్ నిర్ణయం, సీడబ్ల్యూసీ ఆమోదం మేరకే జరిగాయి. ఇవన్నీ స్పష్టంగా ఉంటే సోల్ డిసీజన్ అని తప్పుడు ఆరోపణ కుట్రపూరితంగా చేశారు. బ్యారేజీల నిర్మాణం వ్యక్తుల నిర్ణయం అనేది పచ్చి అబద్ధం. ఇది రాజకీయ దురుద్దేశంతో కూడిన, కుట్ర పూరితమైన ఆరోపణే అని హరీశ్‌రావు మండిపడ్డారు.తమ్మిడిహట్టి వద్ద మీరు తప్పుడు పని చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, మహారాష్ట్రతో ఒప్పందం లేకుండా తప్పు చేశారు. మేడిగడ్డకు కేబినెట్ అప్రూవల్ లేదని సీఎం, మంత్రులు చేస్తున్న ఆరోపణలు శుద్ధ అబద్ధం. సీడబ్ల్యూసీ సూచన మేరకు ప్రాజెక్టును పునర్ పరిశీలించమని వ్యాప్కోస్ సంస్థను కోరడం జరిగింది. దీనిని 2016 జూన్ 14న కేబినెట్ ఆమోదం చేయడం జరిగింది. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌కు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాప్కోస్‌కు అప్పగించింది కాబట్టి, మరోసారి వ్యాప్కోస్ సంస్థకే తెలంగాణ కూడా అప్పగించింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు

# ప్రశ్నించే కలానికే సంకెళ్లా...





- సిరిసిల్లలో ప్రజాస్వామ్యం బతికే ఉందా...
- దేశంలో ఎక్కడ ఉపయోగించిన చట్టం సిరిసిల్ల ఉపయోగించడమా
- జర్నలిస్టుల గొంతు నొక్కేయడం దుర్మార్గమైన చర్య

బలగంటివి,సిరిసిల్ల: జర్నలిస్ట్ కాయితి బాలుపై బిఎన్ఎస్ 163 యాక్ట్ అమలు నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కవులు కళాకారులు ఉద్యమకారులు జర్నలిస్టులు అడ్వకేట్లు మంగళవారం బాలుకు మద్దతు తెలిపారు. మన ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా, మరి ఎక్కడైనా బతుకుతున్నామా ప్రశ్నించే జర్నలిస్టుపై ఉక్కు పాదం మోపడం ప్రజాస్వామ్య దేశంలో మంచిది కాదు అని మండపడ్డారు. ఎంతోమంది కవులను కళాకారులను తన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తీసుకొచ్చిన వ్యక్తి కాయితీ బాలు అని అన్నారు. తన పాట మాటలతో బాలు మద్దతు తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే.. జర్నలిస్టులకి వేదింపులు..

బలగం టివి సిఈవో బాలు కాయితి..

సిరిసిల్ల టీ స్టాల్ మీద కేటీఆర్ బొమ్మ ఉందని టీ కొట్టు నిర్వహకునిపై కేసు నమోదు చే సి క్రేన్ తో టీ కొట్టును తీసివేస్తే వార్తా రాశాను అని,తంగళ్లపల్లి మండలం జిల్లాల లోరైతు రాజిరెడ్డిపై కలెక్టర్ అక్రమ కేసు పెట్టి జైళ్లో నిర్బందిస్తే.. తప్పు అని ఖండిస్తూ వార్తాలు రాశాను.. ఆ కుటుంబాన్ని ఇంటర్వ్యూ చేశానని అన్నారు.వేలాది మంది పాడి రైతుల కడుపు కొట్టేందుకు ఆగ్రహారం పాల డైరిని సీజ్ చేస్తే కలెక్టర్ తీరును తప్పుబట్టాను అని అన్నారు. నాపై వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ కుట్ర పూరితంగా.. కావల్సుకోని.. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేఖంగా నా సతీమణిని అటవి ప్రాంతానికి బదిలి చేశారని అన్నారు.ఉపాధ్యాయుల సర్దుబాట్ల అన్యాయంగా చేశారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేశారని.. హై కోర్టును ఆశ్రయిస్తే,మరింత కలెక్టర్ వేదింపులు పెరిగినాయని అన్నారు. నేను ఇంట్లో లేని సమయంలో.. నా ఇంట్లోకి అనుమతి లేకుండా మున్సిపల్ అధికారులు చొరబడి,ఎలాంటి నోటీసులు లేకుండా మెజర్ మెంట్లు తీసుకున్నారని అన్నారు.ఆఖరకు కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి,మహిళలను ఇబ్బందులకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ,సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి గురిచేస్తున్నారని అన్నారు.గత నెల 21 నోటీసులు ఇచ్చినట్లు పత్రంలో పేర్కొని, 23వ తేదీన రెండు రోజుల ఆలస్యంగా నా ఇంటి గోడలపై రెవెన్యూ అధికారులు బిఎన్ ఎస్ 163 యాక్ట్ నోటీసులు అంటిచారని అన్నారు.వార్తలు రాయొద్దు,అధికారుల తప్పిదాలను ప్రశ్నించదు, బహిరంగ ప్రకటనలు ఉపన్యాసాలు ఇవ్వద్దు అని జర్నలిస్టులపై.. తమకున్న విచక్షణ అధికారులతో చట్టాలను ప్రయోగిస్తూ. ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కుతున్నారని అన్నారు.ఒక జర్నలిస్టుకు వ్యక్తిగతంగా ఇలాంటి ఆర్డర్ ఇవ్వొచ్చా.,నేను ఎవరినైనా, అవమానపరిస్తే తప్పుడు వార్తలు రాస్తే లీగల్ నోటీసులు ఇవ్వచ్చు కేసులు నమోదు చేయొచ్చు కానీ 30 రోజులపాటు ఈ నిర్బంధ ఖండా.. గొంతుకు తాళం వేయడం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని చూస్తున్నని అన్నారు.

### ఇదెక్కడి ప్రజాస్వామ్యమం..
### కవి.గాయకుడు మిట్టపెల్లి సురేందర్

వార్తలు రాసే వ్యక్తిపై కక్ష సాధింపు చర్యలు తీసుకుంటారా ఇదెక్కడి ప్రజాస్వామ్యమని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చేందిన జర్నలిస్టు వ్యక్తి పైకి రావద్దా, ప్రజల పక్షాన పోరాడితే గొంతు నొక్కి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వార్తలు రాస్తే ఇంటి మీదకి , కుటుంబ జోలిదాక రావడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వ్యక్తి పైన అతని పై సిద్ధాంత పరంగా పోరాడాలి కానీ, వ్యక్తిగతంగా అచ్చుడు ఏంది అని మండిపడ్డారు. బాలు కాయితి పై న బిఎన్ఎస్ 163 యాక్ట్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.. లేనిపక్షంలో తెలంగాణ ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

### ఎక్కడలేని చట్టం సిరిసిల్లలో ఉపయోగించడం దారుణం..గాయకుడు రేంజర్ల రాజేష్

గల్ఫ్ బాధితులకు అండగా కాయితి బాలు ఉన్నారని అన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ద్వారా మాట్లాడే హక్కు ఇచ్చిందని, కానీ హక్కును బిఎన్ఎస్ 163 యాక్ట్ ద్వారా ఈ ప్రభుత్వం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కళాకారులను జర్నలిస్టులను ఉద్యమకారులను అణిచివేయడం సరికాదు అని, ఎక్కడలేని చట్టం సిరిసిల్లలో ఉపయోగించడం దారుణమని అన్నారు. తెలంగాణ గొప్ప లక్షణం ప్రశ్నించడం అని అన్నారు.వెంటనే నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

### జర్నలిస్టుల గొంతు నొక్కేయడం దుర్మార్గమైన చర్య
### కాలేజీ టీవీ సిఈవో దాసరి శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల గొంతు నొక్కేయడం దుర్మార్గమైన, కక్షపూరితమైన చర్య అని అన్నారు.సిరిసిల్లాలో ప్రశ్నించే తత్వం పోరాడే తత్వం ఉన్నది అని, కానీ రాజకీయ చైతన్యం లేదు అని అన్నారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నాడని, బడుగు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులపై కక్ష పూర్వకంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు.

### ప్రశ్నించే వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతుండ్రు..
### టీఎస్ 24 టివి సిఈవో ఆకుల శ్రీనివాస్ రెడ్డి

కలెక్టర్ అన్ని రకాలుగా చట్టాన్ని వాడుకున్నాడని, ప్రశ్నించే వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడని అన్నారు. కలెక్టర్ కాండవ వేసుకొని కాంగ్రెస్ కార్యకర్త అని అన్నారు. కలెక్టర్ ఎన్ని రకాలుగా కుట్రలు చేసిన ప్రజాబలం ముందు నిలబడవు అని అన్నారు. బ్రిటిష్ కాలంలో చేసిన చట్టాలు ఇవి అని, ప్రస్తుతం సిరిసిల్లలో ఉపయోగిస్తున్నారని అన్నారు.

### బాలుకు అండగా ఉంటాం
### ఎన్ 9 మీడియా ఇంచార్జి రాకేష్

ఎంతోమందికి సోషల్ మీడియా ద్వారా సహాయం అందించిన వ్యక్తి కాయితి బాలు అని అన్నారు. జిల్లా కలెక్టర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని, బాలుపై మీరు ఎన్ని కుట్రలు పన్నిన సోషల్ మీడియా ద్వారా తిప్పికొడతామని, బాలుకు అండగా మేమందరం ఉంటామని అన్నారు.

### గల్ఫ్ కార్మికులకి అండగా బాలు కాయితి
### గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు గుగ్గిళ్ళ రవి

ఎంతోమంది గల్ఫ్ కార్మికులకు బాలు అండగా ఉన్నారని, గల్ఫ్ కార్మికుల ఏ కష్టం వచ్చినా బాలు అండగా నిలబడతాడని అ న్నారు. అలాంటి వ్యక్తిపై కక్షపూరిత చర్యలకు పాల్పడడం, కుటుంబాల దాకా వెళ్లడం బాధాకరమని అన్నారు.ఎవరైనా కక్ష సాధింపు దూరణిలో పోయిన ఏవ్యక్తి కూడాబాగుపడ్డట్టు చరిత్రలో లేదు అని అన్నారు. బాలుకు గల్ఫ్ కార్మికులు అందరూ అండగా గా ఉంటారని అన్నారు.

### వ్యక్తిగత కక్షలతోనే
### హైకోర్టు అడ్వకేట్ అనిల్

బాలు పై వ్యక్తిగత కక్షలతోనే ఇదంతా జరుగుతుందని దీని న్యాయవ్యవస్థ ద్వారా తిప్పికొడతామని అన్నారు. జర్నలిస్టులు ఉద్యమకారులపై కేసులు పెడుతున్నారని ఇది ఏమాత్రం మంచిది కాదు అని అన్నారు.

## భారీగా పెరిగిన బంగారం ధరలు.. తులం ఖరీదు ఎంతంటే..!



హైదరాబాద్, ఆగస్టు-05:పసిడి ధర పరుగులు తీస్తూనే ఉంది. శ్రావణమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారానికి భారీగా డిమాండ్ పెరిగింది. దాంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇవాళ బంగారం ధర తులంపై ఏకంగా రూ.820 ఎక్కువైంది. బంగారంతోపాటు వెండి ధరకూడా చుక్కలు చూపిస్తోంది. కిలో వెండి ధర ఏకంగా రూ.2 వేలు పెరిగింది.మంగళవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.820 పెరిగి రూ. 1,02,220 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.750 పెరిగి రూ.93,700 వద్ద ట్రేడవుతోంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.76,700కు చేరింది. అదే సమయంలో వెండి ధర కూడా పెరుగుతోంది. కిలో వెండి ధర ఏకంగా రూ.2 వేలు పెరిగి .1,15,000 వద్ద ట్రేడవుతోంది.కర్ణాటక రాజధాని బెంగళూరు, దేశ రాజధాని ఢిల్లీ, మహారాష్ట్ర రాజధాని ముంబై, పశ్చిబెంగాల్ రాజధాని కోల్‌కతాలో కూడా బంగారం ధరలు ఇదేవిధంగా ఉన్నాయి. చెన్నైలో మాత్రం మరో రూ.10 వేల ఎక్కువ ధర ఉంది.

## 'భారత్ హిందూ సేవా వేదిక' ఆవిష్కరణ..

### వ్యవస్థాపక బృందంలో ఉన్నది వీళ్లే..!

హైదరాబాద్, ఆగస్టు-05: విదేశాల్లో ఉంటున్నా సొంతగడ్డపై మమకారాన్ని చాటుకుంటున్నారు ప్రవాసీలు. భారతీయ పండుగలు, సంస్కృతిని పాటిస్తున్న ఎన్ఆర్ఐలు ఈసారి భారత్ హిందూ సేవా వేదికతో హిందూ ధర్మ పరిరక్షణలో భాగం కానున్నారు. హిందూ ధర్మాన్ని, సంస్కృతి విలువలను, సేవా దృక్పథాన్ని కొనసాగించడంతో పాటు సమాజంలో సామరస్యాన్ని ఏర్పరచాలనే లక్ష్యంతో దీన్ని స్థాపించారు.భారత్ హిందూ సేవా ఆధికారిక ఆవిష్కరణ కార్యక్రమం ఆగస్టు 5 మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు జరుగునుంది. మిడ్‌రాండ్‌లోని డ్రీమ్‌హిల్ ఇంటర్నేషనల్ స్కూల్, 78 లూరెన్స్ స్ట్రీట్, హాఫ్‌వే హౌస్, మిడ్‌రాండ్, 1685 వద్ద ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా శుభ ఘడియలో ఘనంగా సంస్థను ప్రారంభిస్తున్నందున.. వ్యవ స్థాపక బృందాన్ని అధికారికంగా పరిచయం చేయనున్నారు.భారత్ హిందూ సేవా వేదిక ప్రధాన బృంద సభ్యులు: కిరణ్ కుమార్ బెల్లి-సలహాదారు ఛైర్మన్, సాయి వినయ్ వడ్లమూరి - అధ్యక్షుడు, సుధీర్ బీమిరెడ్డి -ఉపాధ్యక్షుడు, ఫణి కాటూరి-ఉపాధ్యక్షుడు, జగదీష్ చింతనిప్పు- కోశాధికారి, కౌముది వేముల బీమిరెడ్డి - ప్రధాన కార్యదర్శి, లక్ష్మి ఐశ్వర్య ముమ్మిడివరపు - పీఆర్, మార్కెటింగ్ , సూర్య ముమ్మిడివరపు - సలహాదారు, సర్వేశ్ దాల్వి - ఈవెంట్ కోఆర్డినేటర్. కార్యక్రమానంతరం టీ, అల్పాహారం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## ప్రజాహితం కోసం పోలీసు వ్యవస్థ కృషి చేయాలి..

### జస్టిస్ బి. శివశంకర రావు



హైదరాబాద్,ఆగస్టు 5 : రాష్ట్రంలో ప్రజాహితం కోసం పోలీసు వ్యవస్థ కృషి చేయాలని రాష్ట్ర పోలీసు కంప్లైంట్స్ అథారిటీ ఛైర్మన్ జస్టిస్ బీ శివశంకర రావ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని బీఆర్కే భవన్‌లోని పోలీసు కంప్లైంట్స్ అథారిటీ కార్యాలయంలో అథారిటీ ఛైర్మన్, సభ్యులను హోం శాఖ కార్యదర్శి రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, అడిషనల్ డీజీపీ(లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం. భగ వత్‌లు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సంద ర్భంగా పోలీస్ వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను సవరించి.. ప్రజహితం వైపు పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం కోసం అవసరమైన పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో అథారిటీ రాష్ట్ర సభ్యులు పి. ప్రమోద్ కుమార్, డాక్టర్. వర్రె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 7న కోటమైసమ్మ తల్లి జాతరలో కొబ్బరికాయల అమ్మకానికి వేలం

కారేపల్లి, ఆగస్టు 05 : దసరా పండుగ సందర్భంగా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి అలయ ప్రాంగణంలో నిర్వహించే జాతరలో కొబ్బరికాయల అమ్మకానికి ఈనెల 7న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈఓ కొండ కింది వేణుగోపాలాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 26వ తేదీ నుంచి అక్టోబర్ 6వ వరకు 11 రోజులు పాటు జరిగే జాతరలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మకాలకు గత నెల 17, 28 తేదీల్లో వేలం పాటలు నిర్వహించగా పాటదారులు ముందుకు రాలేదన్నారు.కొబ్బరికాయల వేలం వాయిదా పడింది. దీనికి సంబంధించి 7న వేలం పాట నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు

### : మొహ్మద్ యూనస్



హైదరాబాద్, ఆగస్టు-05: బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మొహ్మద్ యూనస్ కీలక ప్రకటన చేశారు. దేశ సార్వత్రిక ఎన్నికలు వచ్చ ఏడాది ఫిబ్ర వరిలో జరుగుతాయన్నారు. దేశాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో యూనస్ మాట్లాడుతూ తాత్కాలిక ప్రభుత్వం తరఫున చీఫ్ ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాయనున్నట్లు తెలిపారు. రాబోయే రంజాన్ కంటే ముందుగానే అంటే 2026 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిం చాలని ఈసీని కోరనున్నట్లు తెలిపారు. జులై 2024 తిరుగుబాటు తర్వాత షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం పతనమైన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తిరుగుబాటు చేయడంతో చివరకు హసీనా ప్రభుత్వం ఆగస్టు 2024న పడిపోగా.. ఆమె భార త్‌కు చేరుకుంది. ఆ తర్వాత యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. గత కొన్ని నెలలుగా బంగ్లాదే శ్‌లోని రాజకీయ పార్టీలు తాజా సార్వ త్రిక ఎన్నికలను డిమాండ్ చేస్తున్నాయి.గతంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఏప్రిల్ 2026లో ఎన్నికలు నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఖలీదా జియా పార్టీ బీఎన్‌పీతో పాటు ఇతర పార్టీలు డిసెంబర్ నాటికి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఖలీదా జియా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మే 28న ఢాకాలో భారీ ర్యాలీ నిర్వహించి డిసెంబర్ నాటికి ఎన్నికలు నిర్వహిం చాలని డిమాండ్ చేసింది. యూనస్ నేతృత్వంలోని తాత్కా లిక ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. జూలైలో తిరుగుబాటు చేసిన నాయకుల నుంచి ఏర్పడిన కొత్త రాజకీయ పార్టీ నేషనల్ సిటిజన్ పార్టీ సైతం సంస్కరణలు పూర్తయిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని పట్టుబడుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి జాతీయ ఎన్నికలు నిర్వహించాలని ఆర్మీ చీఫ్ జనరల్ వకార్-ఉజ్-జమాన్ గతంలో వ్యాఖ్యానించారు.



## డీడీలు కడితే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తాం..

### విద్యుత్ శాఖ ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి

గద్వాల అర్బన్ : అధికలోడు కరెంటుతో ఇబ్బందులు పడుతున్న రైతులందరూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు చెల్లించాలని.. అప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని విద్యుత్ శాఖ ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కేడిదొడ్డి మండలం పరిధిలోని ఉమిత్యాల గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా గురించి రైతులను అరా తీశారు. కరెంటుపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నవారు తన దృష్టికి తీసుకువస్తే.. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అక్రమంగా విద్యుత్‌ను ఎవరూ వాడొద్దని ఆయన హెచ్చరించారు. అక్రమంగా కరెంటు కనెక్షన్ తీసుకొని.. ఉపయోగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్సీ హెచ్చరించారు.విద్యుత్ సరఫరాలో ఏ చిన్న సమస్య ఉన్నా అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ డీఈ తిరుపతిరావు, ఏడిఏ రమేష్ బాబు, మండల ఏఈ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులు ఎదుర్కొంటున్న నాయకులు, కార్యకర్తలకు న్యాయ సహాయం అందించాలి

ఏపీలో చంద్రబాబు పాలన చూస్తుంటే కలియుగం అంటే ఎలా ఉంటుందో కనిపిస్తుందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలతో కేసులు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఏ తప్పు చేయకపోయినా బురదవేసి కడుక్కోమంటున్నారని విమర్శించారు. వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధులతో మంగళవారం నాడు వైఎస్ జగన్‌ను సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్రమ కేసులు ఎదుర్కొంటున్న నాయకులు, కార్యకర్తలకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు లాయర్లు అందించిన సేవను ఎప్పటికీ మరిచిపోమని స్పష్టం చేశారు.మూడేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది వైసీపీనే అని వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారిని జగన్ 2.0లో ప్రత్యేకంగా గుర్తిస్తామని తెలిపారు. పార్టీకి పనిచేసే వారికోసం డేటాబేస్ పెడుతున్నామని చెప్పారు. దీని ఆధారంగానే వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కోసం ఎవరు కష్టపడతారో.. వారికే వచ్చే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. త్వరలోనే యాప్ విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అన్యాయం జరిగినా ఈ యాప్‌లోనే ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని



స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది.. తప్పుచేయకపోయినా దెబ్బలు తింటున్న వ్యక్తికి ఎంత బాధ ఉంటుందో, అన్యాయంగా బాధ పెట్టిన వ్యక్తికి కూడా అర్థం కావాలని అన్నారు. ఇప్పుడు ఇబ్బంది పెట్టిన అధికారులపై కచ్చితంగా యాక్షన్ ఉంటుందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం మరిచిపోయిందని వైఎస్ జగన్ అన్నారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని విమర్శించారు. లిక్కర్‌లో అవినీతి విపరీతంగా ఉందని.. ఎమ్మార్పీకి మించి మద్యం అమ్ముతున్నారని, ప్రతి గ్రామంలోనూ వీధికో బెల్టు షాపు ఉందని అన్నారు. ఉచిక ఇసుక పేరుతో దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఉచిత ఇసుక ఎవరికి ఇస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, కొంతమంది పోలీసులు దగ్గరుండి పేకాట క్లబ్బులు నడిపిస్తున్నారని అన్నారు.అమరావతిలో అవినీతికి అంతులేకుండా పోతుందని వైఎస్ జగన్ అన్నారు. చదరపు అడుగుకు రూ.10వేలు ఖర్చు చేస్తున్నారని.. చదరపు అడుగుకు రూ.4 వేలు పెడితే ఫైవ్ స్టార్ సదుపాయాలు వస్తాయని తెలిపారు. మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. 10 శాతం ఇచ్చి 8 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుమల : తిరుమలలోని శ్రీవారి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే పవిత్రోత్సవాల తొలిరోజు పవిత్రాల ప్రతిష్టను నిర్వహించారు. ఆగస్టు 6న పవిత్ర సమర్పణ, ఆగస్టు 7న పూర్ణాహుతి ఉంటుందన్నారు. 5న అష్టదళ పాద పద్మారాధన సేవ, ఆగస్టు 7న తిరుప్పావడ సేవతో పాటు ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేస్తున్నామని వివరించారు.టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

### 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు..

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 20 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం అవుతుందని ఆలయ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 69,928 మంది భక్తులు దర్శించుకోగా 29,297 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.21 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## విషాదం.. డెంగీతో భర్త చనిపోయిన కొన్ని గంటల్లోనే భార్య మృతి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా నగరం మండలంలో విషాదం ( చోటు చేసుకుంది. భర్త చనిపోయిన కొద్ది గంటల్లోనే భార్య మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నగరం మండలం ఈదుపల్లిలో గత కొన్ని రోజులుగా గ్రామస్థులు జ్వరాలతో బాధపడుతు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ క్రమంలో తుమ్మల సుబ్బారావు, మహాలక్ష్మి అనే దంపతులు కూడా జ్వరంతో బాధ పడుతున్నారు.వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తుమ్మల సుబ్బారావు, మహాలక్ష్మిని తెనాలి నుంచి గుంటూరు ఆస్పత్రికి తరలించే క్రమంలో సుబ్బారావు మృతి చెందాడు. భర్త చనిపోయిన గంటల వ్యవధిలోనే భార్య మహాలక్ష్మి కూడా మృతి చెందింది. ఘటనపై స్పందించిన ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ డెంగీ జ్వరాలపై ఆరా తీశారు.డెంగీ వ్యాప్తిపై నగరంలో మండలంలో ఫీవర్ సర్వే చేయించాలని అధికారులకు ఆదేశించారు. జ్వరం ఉన్న వారికి పరీక్షలు జరిపి చికిత్స అందించాలని, డెంగీ కట్టడికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు పెంపొందే ప్రాంతాలను గుర్తించి శుభ్రంగా మార్చాలని, పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## తిరుమలలో చిరుత కలకలం.. పిల్లి మీద దాడికి యత్నం



తిరుమల : తిరుమలలో మరో సారి చిరుత సం చారం కలకలం రేపుతోంది. ఈస్ట్ బాలాజీ నగర్ సమీపంలో ఉన్న బాల గంగమ్మ ఆలయం పరిసరాల్లో సోమవారం రాత్రి చిరుత సంచ రించింది. అక్కడున్న ఓ పిల్లి మీద దాడి చేసేందుకు చిరుత యత్నించింది. ఈ దృశ్యాలన్నీ అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. చిరుత సంచారంపై ఆలయ సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు ఆలయం వద్దకు చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులను అప్రమత్తం చేశారు.

## రాజానగరం ఎమ్మెల్యే అనుచరుల అరాచకం..

### చోద్యం చూస్తున్న అధికారులు

### కల్వచర్లలో మట్టి మాఫియా విధ్వంసం

### అర్ధరాత్రి అడ్డుకున్న స్థానికులు

### పుష్కరకాల్వ పునాదులనే తవ్వేస్తున్న ఘనులు



రాజానగరం నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అక్కడికి దగ్గరలో ఉన్న కలవచర్ల గ్రామంలో పోలవరం ఎడమ కాల్వ పనులు, పుష్కర కాల్వ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోజు వందల లారీలతో అక్కడ మట్టిని స్థానిక జనసేన ఎమ్మెల్యే బత్తుల బల రామక్రిష్ణ అనుచరులు తరలించుకుపోతున్నారు. వీరి ఆగడాలు భరించలేని స్థానిక ప్రజలు అర్ధరాత్రి లారీలను అడ్డుకుని, మట్టి మాఫియాపై తిరుగుబాటు చేశారు. ప్రజల్లో చైతన్యం రావడంతో రాత్రికి రాత్రి వార్త వైరల్ అయిపోయింది.ఎంతో ఘనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేస్తున్న దందాలు రోజురోజుకి శృతిమించుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ కాల్వలు ఆక్రమించినా, నీళ్లు వెళ్లే మార్గాన్ని ఆపినా సహించేది లేదని వార్నింగులు ఇచ్చారు. కానీ సాక్షాత్తూ ఆ పార్టీకి చెందిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ క్రిష్ణ సారథ్యంలో ప్రతిష్టాత్మకమైన పోలవరం కాల్వ, పుష్కర కాల్వల మట్టిని అడ్డగోలుగా తరలిస్తుంటే.. ఆయన చేష్టలుడిగి చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుకి 100 లారీలకు పైనే నాన్ స్టాప్ గా తిరుగుతున్నాయని, అడిగేవాడు, ఆపేవాడే లేడని కలవచర్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది సంబంధిత అధికారులకు విన్నవించినా తేలు కుట్టిన దొంగల్లా అందరూ గమ్మున ఉంటున్నారు కానీ, ఎవరూ పట్టించున్న పాపాన పోలేదని సీరియస్ అవుతున్నారు. రోజూ అధికారుల చుట్టూ తిరగడమే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒకరిని అత్యవసరంగా 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుంటే, ఈ మట్టి లారీల వల్ల రెండు గంటలు ఆలస్యంగా వెళ్లామని, దీంతో ఒక నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.పుష్కర కాల్వ కోసం తవ్విన మట్టిని తీస్తే పర్వాలేదు, మొత్తం కాల్వ పునాదులనే తవ్వి తవ్వి లాగేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇలా జరిగితే, గట్లు బలహీనంగా మారతాయని, రేపు కాల్వలకు నీళ్లు వదిలినప్పుడు గండ్లు పడి ఊళ్లకు ఊళ్లే మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రజలందరూ ఏకమై తిరుగుబాటు చేశామని అన్నారు. మొత్తానికి మట్టి మాఫియా చేస్తున్న ఆగడాలపై వార్తలు రావడంతో ఎక్కడి దొంగలక్కడే గప్ చుప్ అన్నట్టు అయిపోయారు.మరి ఈ ఘటన నేపథ్యంలో రేపు కూటమి నేతలు ఎలా బదులిస్తారో చూస్తామని ప్రజలు అంటున్నారు. అయినా ఆపకపోతే ఆందోళన ఉధ్రతం చేస్తామని హెచ్చరించారు. మంచి ప్రభుత్వమని ఓట్లే సి గెలిపిస్తే, మా మంచిగా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. నెట్టింట్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

## గౌతు శిరీషపై మాజీ మంత్రి మండిపడ్డారు



పలాస టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీషపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. గత కొద్దిరోజులుగా గౌతు శిరీష ఎమ్మెల్యే స్థాయిని మరిచి దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కాశీబుగ్గలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నీచ రాజకీయాలు చేస్తూ నీతులు చెబుతున్నారని మండిపడ్డారు.అభివృద్ధి గురించి మాట్లాడటం, తాత తండ్రుల గురించి చెప్పుకోవడం కాదని.. గతంలో నే మంత్రిగా చేసిన అభివృద్ధి ఏంటో.. 60 ఏండ్లలో మీ గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏంటో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని సీదిరి అప్పలరాజు అన్నారు. నీకు, నాకు అసలు పోలిక ఏంటి అని గౌతు శిరీషను సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. నీ గురించి మా ఇంట్లో కుక్కలు కూడా మాట్లాడుకోవని అన్నారు. నువ్వు ఎమ్మెల్యే కాబట్టి ప్రజలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అది నీ స్థాయి.. నువ్వు నా గురించి మాట్లాడతావా అని మండిపడ్డారు. గౌతు శిరీష నోటికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటికి వచ్చినట్లు అవినీతి ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఎమ్మెల్యేగా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీదిరి అప్పలరాజు సూచించారు. తనను మాటిమాటికీ పశువని, భాషా సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. తాను ఆ స్థాయికి దిగజారి మాట్లాడలేనని వ్యాఖ్యానించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవస్థలన్నీ పాడైపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు.

## ఇది కేవలం ఆట కాదు.. క్రికెట్ మాస్టర్ క్లాస్

### మైక్రోసాఫ్ట్ సీఈవో



మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల క్రికెట్‌పై తనకున్న అభిమానాన్ని మరో సారి చాటుకున్నారు. ఇటీవల ముగిసిన ఇండియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌ను ఆయన ప్రశంసించారు. ఇది కేవలం ఒక ఆట కాదని.. ఇది స్థిరత్వం, వ్యూహం, క్రీడా స్ఫూర్తికి ఒక మాస్టర్ క్లాస్ అని ఆయన అభివర్ణించారు. 5 మ్యాచ్‌ల ఈ టెస్ట్ సిరీస్ 2-2తో సమంగా ముగిసిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో ఇరు జట్లు చూపిన అద్భుత ప్రదర్శనలకు క్రికెట్ ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ క్రమంలో ఈ టెస్ట్ సిరీస్ గురించి మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. ఇంగ్లాండ్ జట్లకు నా అభినందనలు." అని నాదెళ్ల రాశారు. ఈ పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల నుంచి పెద్ద ఎత్తున స్పం దనను పొందింది. ఈ పోస్ట్‌కు మూడు లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఆనంద్ మహీంద్రా స్పందన సత్య నాదెళ్లతో పాటు మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా కూడా ఈ సిరీస్‌పై తన అభిప్రాయాలను పంచు కున్నారు. మహీంద్రా కూడా ఎక్స్ లో ఒక పోస్ట్ చేస్తూ, "స్కోర్ బోర్డ్ 2-2 అని, సిరీస్ డ్రా అని చూపిస్తోంది. కానీ క్రీడా స్ఫూర్తి ప్రకారం ఈ సిరీస్ భారత్ గెలిచింది. ఎందుకంటే, ఓటమి అంచున ఉన్నప్పుడు కూడా తిరిగి వచ్చి పోరాడే స్ఫూర్తిని స్కోర్‌బోర్డ్ పూర్తిగా వివరించలేదు" అని పేర్కొన్నారు. మహీంద్రా తన పోస్ట్‌లో అమెరికన్ ఫుట్‌బాల్ కోచ్ విన్స్ లోం బార్డి మాటలను గుర్తు చేసుకున్నారు. "మీరు పడిపోయారా లేదా అనేది ముఖ్యంకాదు,మీరుతిరిగి లేచారా లేదా అనేది ముఖ్యం." అని పేర్కొన్నారు.

## బైక్‌పై పొలానికి వెళ్తూ.. విద్యుదాఘాతంతో యువకుడు సజీవ దహనం



కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో విషాదం చోటుచేసుకున్నది. బైక్‌పై పొలానికి వెళ్తూ విద్యుదాఘాతంతో వాహనంతో సహా యువకుడు దగ్ధమయ్యాడు. గుండాల మండలంల శంభునిగూడెం పంచాయతీ వెన్నెలబైలు గ్రానికి చెందిన పర్సిక రాజు (35) ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ హైటెన్షన్ తీగలు తగలడంతో బైక్ దగ్ధమైంది. దీంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కూరుకుపోయిన వాటర్ ట్యాంకర్

హైదరాబాద్ : బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబర్ 1/12లో రోడ్డు



కుంగిపోయింది. రోడ్డు ఆకస్మాత్తుగా కుంగడంతో.. అటువైపుగా వెపుగా వస్తున్న వాటర్ ట్యాంకర్ అందులో కూరుకుపోయింది. దీంతో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు.. డ్రైవర్, క్లీనర్‌ను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. భారీ వర్షం కారణంగానే రోడ్డు కుంగినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్డు కుంగిన ఏరియాలో నాలా పైప్‌లైన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రోడ్డు కుంగడంతో ఆ ఏరియాతో పాటు సమీప ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. వాటర్ ట్యాంకర్‌ను బయటకు తీసేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.

## కర్నాటకలో ట్రాన్స్‌పోర్టు వర్కర్ల సమ్మె..

### ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం

బెంగుళూరు: కర్నాటక రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన ఉద్యోగులు



నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి పబ్లిక్ బస్సు సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆందోళన చేయవద్దు అని కోర్టు స్టే ఇచ్చినా ఉద్యోగ సంఘాలు మాత్రం నిరసనలో పాల్గొన్నాయి. జీతాలను సవరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అనేక చోట్ల బస్సులను డిపోల్లోనే పార్క్ చేశారు. కొన్ని బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి.సమ్మెలో పాల్గొనేందుకు కొందరు ఉద్యోగులు వ్యతిరేకించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను తరలించేందుకు కొందరు డ్రైవర్లు బస్సులను ఆపరేట్ చేస్తున్నట్లు తెలిసింది. పరిస్థితిని అధిగమించేందుకు రవాణా సంస్థ ట్రైనీ డ్రైవర్లను రంగంలోకి దించింది. బెంగుళూరు, చిక్కమంగళూరు, రాయ్‌చుర్, చిత్రదుర్గ్, హుబ్లి, ధర్వాడ్, బెల్గావి, మంగుళూరు, మైసూరు, తుమకూరు, హసన్ మాడికేరి, శివమొగ్గ, కాలబుర్గి పట్టణాల్లో ప్రయాణికులు భారీ సంఖ్యలో ఉన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు దొరక్క వేల సంఖ్యలో ప్రయాణికులు నిలిపోయారు.సమ్మె ప్రారంభం కావడానికి ముందు బయలుదేరిన బస్సులు మాత్రమే రోడ్లపై ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు బస్సు ఆపరేటర్లు, క్యాబ్ డ్రైవర్లు దండిగా ఆర్జిస్తున్నారు. బెంగులూరులో ఆటో రిక్షాలు ఎక్కువగా వసూల్ చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగ సంఘాలు, కర్నాటక ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఎరియర్స్ రూపంలో 38 నెలల జీతాన్ని ఇవ్వాలని, అలాగే 2024 జనవరి ఒకటో తేదీ నుంచి సవరించిన వేతనాన్ని ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

## మూడేళ్లుగా పరారీలో ఉన్న హీరోయిన్..

### ఎట్టకేలకి అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోలీవుడ్‌లో తరచూ వివాదాలకు కేంద్రబిందువైన నటి మీరా మిథున్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. మూడేళ్లుగా పరారీలో ఉన్న ఆమెపై చెన్నై కోర్టు తాజాగా అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. వెంటనే అరెస్ట్ చేసి ఈ నెల 11వ తేదీన కోర్టులో హాజరు పరచాలని చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే తాజాగా నటి మీరా మిథున్‌ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మూడేళ్లుగా పరారీలో ఉన్న ఆమెను ప్రస్తుతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో ఉన్న మీరా మిథున్‌ను రక్షించి అప్పగించాలంటూ ఆమె తల్లి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం కోర్టులో విచారణకు వచ్చింది.




# సినిమా

## షారుక్, బన్నీ.. మరో ఇండస్ట్రీ దర్శకుడు?





ఇప్పుడు ఇండియన్ సినిమా దగ్గర ఎలాంటి భారీ కాంబినేషన్‌లు సెట్టవుతున్నాయో ప్రత్యేకంగా చెప్పుకో వాల్సిన అవసరంలేదు. ఒక ఇండస్ట్రీ నుంచి మరో ఇం డస్ట్రీ హీరోలు, దర్శకులు కలిసి పని చేస్తున్నారు. ఇక ఇలానే ఓ క్రేజీ కాంబినేషన్ లాక్ అయినట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి.ఇండియన్ బాక్సాఫీస్ సెన్సేషనల్ హీరోలు షారుఖ్ ఖాన్ అలాగే ఐకా న్ స్టార్ అల్లు అర్జున్ లాంటి స్టార్జ్ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు ఈ భారీ కాంబినేషన్ లో సినిమా ఉండే ఛాన్స్ ఉం దట. వీరిద్దరి కలయికలో తెలుగు నుంచి కాదు హిందీ నుంచి కాదు సౌత్ నుంచి మరోభాష దర్శకుడువర్క్ చేయనున్న ట్టుఫ్రెష్‌రూమ ర్స్ వినిపిస్తు న్నాయి.మరిఇందులోఎంతవరకునిజంఉంది అనేది కాలమే నిర్ణయించాలి.

## ఎస్క్వైర్ ఇండియా మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన ఎన్టీఆర్



తన నటనతో స్టార్ నటుడిగా గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఇండియాకు చెందిన ఎస్క్వైర్ మ్యాగజైన్ కవర్‌పై ఎన్టీఆర్‌ను ప్రచూరించారు నిర్వహాకులు. 'ఫ్రమ్ టీన్ ప్రాడిజీ టు పాన్-ఇండియా పవర్‌హౌస్' (టీనేజ్ సంచలనం నుంచి పాన్-ఇండియా శక్తిగా) మారిన స్టార్ నటుడంటూ రాసుకోచ్చింది. మెరున్ కలర్ షేర్వానీ ధరించిన ఎన్టీఆర్ కూర్చీలో కుర్చుని స్టైలీష్‌గా కనిపిస్తున్నాడు. ఇక ఈ ఫొటో షూట్ దుబాయ్‌లో జరిగి నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.అతడిలో చరిష్మా ఉంది. చాలా చురుకైన వ్యక్తి. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఉన్న స్టార్ నటులలో అతడు కూడా ఒకరు. గొప్ప కుటుంబంలో పుట్టినప్పటికీ.. ఆ వారసత్వానికి కట్టుబడి ఉండాలని ఆయన ఎప్పుడూ కోరుకోలేదు. అతడే ఎన్టీఆర్. అతడి సినీ ప్రయాణాన్ని మా ఆగష్టు సంచికలో మేము సెలబ్రేట్ చేయబోతున్నాం. ఇది అతడి తొలి మ్యాగజైన్ కవర్ కూడా అంటూ ఎస్క్వైర్ రాసుకోచ్చింది. సినిమాల విషయానికి వస్తే.. ఎన్టీఆర్ ప్రస్తుతం వార్ 2 సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## పరశురాముడి విశ్వరూపం..
### థియేటర్ల టాప్ లేవాల్సిందేనట..!



ప్రముఖ నిర్మాణ సంస్థ హెంబాలే ఫిలింస్ బ్యానర్ నుంచి వచ్చిన లేటెస్ట్ యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహా' ఇటీవల రిలీజ్ అయ్యి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఓ యానిమేషన్ సినిమా బడా చిత్రాలను ఓవర్‌టైక్ చేసి కలెక్షన్స్‌తో విధ్వంసం క్రియేట్ చేస్తోంది. ఏకంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు కలెక్ట్ చేసి 'మహావతార్ నరసింహా' రికార్డులు క్రియేట్ చేస్తోంది.ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర సక్సెస్‌పై స్పందించారు. ఇలాంటి యునానిమస్ రెస్పాన్స్ రావడం సంతోషంగా ఉందని దర్శకుడు అశ్విన్ కుమార్ అన్నారు. అయితే, ఈ సినిమా తర్వాత తాము 'మహావతార్ పరశురాముడు' చిత్రాన్ని రూపొందించబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ జరుగుతుందని.. ఈ సినిమాతో థియేటర్ల టాప్ లేవాల్సిందే అని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.'మహావతార్ నరసింహా' కంటే ఎక్కువ ఉగ్రరూపాన్ని పరశురాముడి సినిమాలో ఉంటుందని.. ఈ విధ్వంసంతో ప్రేక్షకులు ఊగిపోవడం ఖాయమని ఆయన అంటున్నారు. ఈ సినిమాను మరింత ఎక్కువ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## శివకార్తికేయన్ 'పరాశక్తి' సినిమాలో విలన్ ఆఫర్‌ని రిజెక్ట్ చేశాను : లోకేష్ కనగరాజ్



లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం కూలీ. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నాగార్జున, ఆమిర్ ఖాన్, శృతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం కూలీ. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నాగార్జున, ఆమిర్ ఖాన్, శృతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ చేస్తున్నాడు లోకేష్. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా లోకేష్ మాట్లాడుతూ.. తనకు శివకార్తికేయన్ సినిమాలో విలన్‌గా చేయమని ఆఫర్ వచ్చిందని కానీ తాను రిజెక్ట్ చేసినట్లు లోకేష్ తెలిపాడు.సుధా కొంగర దర్శకత్వంలో రాబోతున్న 'పరాశక్తి' అనే చిత్రంలో తనని విలన్‌గా చేయమని శివకార్తికేయన్ అడిగాడు. కథ కూడా తనకు బాగా నచ్చింది. అయితే తాను అప్పుడు రజనీకాంత్‌తో కూలీ చేస్తుండటంతో ఆ సినిమా ఎఫెక్ట్

## ఒకే ఫ్రేమ్‌లో మహేష్, పవన్ మాస్ కటౌట్స్



మన తెలుగు సినిమా దగ్గర ఉన్నటువంటి బిగ్గెస్ట్ స్టార్స్ లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అలాగే సూపర్ మహేష్ బాబు ఇద్దరూ ఇద్దరే. వీరి సినిమాల రికార్డులు రీజనల్ మార్కెట్ లో మాత్రం మామూలు లెవెల్లో ఉండవు. అయితే పాన్ ఇండియా మార్కెట్ లోకి లేట్ గానే ఎంట్రీ ఇచ్చిన వీరి నడుమ ఓ మల్టీస్టారర్ అంటే ఆ సౌండింగ్ కే ఇండస్ట్రీ షేక్ అవుతుంది. ఇలా ఇద్దరూ కలిసి ఒకే ఫ్రేమ్ లో కనిపించినా ఒకరికోసం ఒకరు మాట్లాడినా మరింత స్పెషల్ గా మారుతుంది.మరి ఇద్దరి సినిమాలు థియేటర్స్ లో ఒకేసారి రావడం అరుదే కానీ థియేటర్స్ దగ్గర ఇద్దరి కటౌట్స్ మాత్రం ఇపుడు ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇస్తున్నాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన అతడు రీరిలీజ్ కి వస్తుండగా ఆ సినిమా నుంచి మహేష్ కటౌట్ ఇంకో పక్క హరిహర వీరమల్లు పై పవన్ కళ్యాణ్ కటౌట్ లు పక్క పక్కనే ఓ థియేటర్ దగ్గర దర్శనమిచ్చాయి. దీనితో ఈ క్రేజీ పిక్ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ నడుమ మంచి వైరల్ గా మారింది.

## సు ఫ్రమ్ సో నవ్వుల హంగామా



కర్ణాటకలో విమర్శకుల ప్రశంసలందుకోవడంతోపాటు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించిన చిత్రం 'సు ఫ్రమ్ సో'. ఈ సినిమాను అదే పేరుతో ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ నెల 8న విడుదల కానున్న ఈ సినిమాలో షనీల్ గౌతమ్, జె.పి.తుమినాడ్, సంధ్య అరకెరె, ప్రకాష్ కె.తుమినాడ్, దీపక్ పనాజే, మైమ్ రాందాస్ ముఖ్య పాత్రధారులు. జె.పి.తుమినాడ్ దర్శకుడు.శశిధర్‌శెట్టి బరోడా, రవిరాయ్ కలసా, రాజ్ బి.శెట్టి నిర్మాతలు. ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఆద్యంతం వినోదాత్మకంగా ట్రైలర్ సాగింది. 'గ్రామీణ జానపద కథలు, మూఢ నమ్మకాలు మిళితమైన వినోదాత్మక ప్రయాణమే 'సు ఫ్రమ్ సో'.ఓ పల్లెటూరిలో జరుగుతున్న విచిత్ర సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఓ వ్యక్తి ఆలోచన ఆ ఊరును గందరగోళంలోకి నెడుతుంది. ఆ తర్వాత నవ్వుల హంగామా మొదలవుతుంది.' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.చంద్రశేఖరన్, సంగీతం: సుమేద్.కె, నేపథ్య సంగీతం: సందీప్ తులసీదాస్.

## అగరం ఫౌండేషన్ ద్వారా ఇంత మంది డాక్టర్స్, ఇంజనీర్స్ అయ్యారా..ఎమోషనల్ అయిన సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. స్టార్ నటుడిగా, మంచి మనసున్న వ్యక్తిగా ఆయనకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే గత కొంతకాలంగా బాక్సాఫీస్ పరంగా విజయాలేమీ లేకపోయినా, సామాజిక సేవలో మాత్రం సూర్య అగ్రస్థానంలో నిలుస్తున్నారు. ఇందుకు ప్రధాన ఉదాహరణగా నిలిచింది ఆయన స్థాపించిన అగరం ఫౌండేషన్ . 2008లో ప్రారంభమైన అగరం ఫౌండేషన్ ఈ ఏడాది 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం చెన్నైలో గ్రాండ్ సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ వేడుకకు సూర్యతో పాటు అతని భార్య జ్యోతిక, సోదరుడు కార్తీ, ప్రముఖ నటుడు కమల్ హాసన్, దర్శకుడు వెట్రిమారన్ తదితరులు హాజరయ్యారు.ఈ వేడుకలో అగరం ఫౌండేషన్ సాయంతో చదువు పూర్తి చేసిన విద్యార్థులు స్టేజ్ పైకి వచ్చారు. ఇప్పటివరకు దాదాపు 8000 మంది విద్యార్థులు అగరం సాయంతో విద్యను పూర్తి చేసుకోగా, వీరిలో 1800 మంది ఇంజినీర్లు , 51 మంది డాక్టర్లు ఉన్నారు. ఈ ఫౌండేషన్ వల్ల తమ జీవితాలు ఎలా మారిపోయాయో అందరూ వేదికపై భావోద్వేగంతో పంచుకున్నారు. ఆ క్షణంలో హీరో సూర్య ఎమోషనల్ అయ్యారు. కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. ఈ సన్నివేశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, నెటిజన్లు సూర్య చేస్తున్న సేవను కొనియాడుతూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.అగరం ఫౌండేషన్ ప్రత్యేకత ఏమిటంటే, పేదలుగా, అనాథలుగా ఉన్న చిన్నారులను ఎంపిక చేసి వారికి కెజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించడం. ఇందుకోసం సూర్య కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అంతేకాదు, తన ఇంటినే అగరం స్కూల్‌కి కేటాయించడం కూడా ఆయన గొప్ప మనసుకే నిదర్శనం. సినిమాల్లో విజయాలు, వైఫల్యాలు వస్తూ పోతూ ఉంటాయి. కానీ.. ఒక మంచి మనిషి చేయగలిగిన మార్పు మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది. సూర్య చేస్తోన్న ఈ సేవ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంది . అగరం ఫౌండేషన్ ద్వారా వెలుగులోకి వచ్చిన వేలాది విద్యార్థుల జీవితాల గురించి తెలుసుకొని ప్రతి ఒక్కరు సూర్యపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

